

హెడ్‌కానిస్టేబుల్ బలవన్మరణం

అప్పుల బాధ తాళలేక మనస్తాపానికి గురై బత్తిని మనోహర్ అనే హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. గార్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. - 10లో▸



ఆస్పత్రి ఎదుట చితిపేర్చి..

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు వరంగల్ నగరంలోని ఓ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
42^0 / 30^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి గాలులు వీస్తాయి. సాయంత్రం ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇరిగేషన్ ఎస్ఈగా జగదీశ్

నర్సంపేట: నర్సంపేట ఇరిగేషన్ శాఖ నూతన ఎస్ఈగా వి.జగదీశ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ములుగు ఇరిగేషన్ సర్కిల్‌లోని ఆకులవారి ఘనపురం ఈఈగా పని చేస్తున్న జగదీశ్ నర్సంపేటకు బదిలీపై వచ్చి ఎస్ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇరిగేషన్ సెక్రటరి రాహుల్‌బొజ్జా ఈసందర్భంగా సర్క్యులర్ జారీ చేశారు.

పెట్రోల్‌బంక్ నిర్వాహకులకు నోటీసులు



ఖానాపురం: ఖానాపురం మండల కేంద్రం శివారులోని ఓంసాయి హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా లీగల్ మెట్రాలజీ, ఫైర్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెట్రోల్, డీజిల్లో కల్తీలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను, ఫైర్ సేఫ్టీ వివరాలను సేకరించారు. నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో బంక్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, రాకేశ్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్, నర్సంపేట ఫైర్ ఆఫీసర్ అక్బర్ మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌లలో కల్తీలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ఖానాపురం: ఖానాపురం మండలం అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌లోని డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల గడువు పెంచినట్లు అకాడమీ ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి, డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శేరికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ(హెచ్ఈపీ), బీఎస్సీ(ఎంపీసీ)లో 40 సీట్ల చొప్పున ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, జూన్ 15 వరకు మరో అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని, పూర్తి వివరాలకు www.tgwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత పత్రాలు జతచేసి, ప్రిన్సిపాల్ పేరు మీద రూ.100 డీడీ తీయాలని పేర్కొన్నారు. వాటిని సైనిక్ స్కూల్‌కు పంపాలని సూచించారు. పూర్తి వివరాలకు 99635 84516, 93980 68250, 89854 69347, 70137 02248, 95533 10104 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెడికల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట రూరల్: కలెక్టర్ ఆదేశాల్ని పాటించని నర్సంపేట మెడికల్ కళాశాల అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య శాఖ మంత్రి, సీఎస్, కలెక్టర్‌కు 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాన్ని, నిరుద్యోగుల సమస్యను ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ 12 పోస్టులకు గత నెల ఏప్రిల్ 19వ నోటిఫికేషన్‌ను కలెక్టర్ ప్రావీణ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారన్నారు. నర్సంపేట డివిజన్‌తోపాటు, వరంగల్ జిల్లా నుంచి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. పత్రిక ప్రకటనలో 12 పోస్టులు చూపించి.. ఈనెల 30న 32 పోస్టులకు రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలిపారు. దీంతో నిరుద్యోగులు ఆశ్చర్యానికి గురయ్యారని, అభ్యర్థులను ఇంటర్వ్యూ, మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం సర్వసాధారణమని, కానీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఏజెన్సీలతో కుమ్మక్కై వారికి నచ్చిన వారికి పోస్టులను కేటాయించారని ఆరోపించారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

బాలిక అదృశ్యం

చెన్నారావుపేట : బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని తోపనగడ్డ తండాలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బాలిక (17) ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పందులు మేపడానికి వెళ్లి వడదెబ్బకు గురై చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన పల్లకొండ ఐలయ్య(74) గురువారం రాత్రి మృతి చెందాడు. ఎండతీవ్రత కారణంగా మనుషులే కాదు.. పశుపక్ష్యాదులు సైతం విలవిల్లాడుతున్నాయి.

నిప్పులు కుమ్మరించినట్లు..

ఎండ తీవ్రత కారణంగా వరంగల్ నుంచి శంభునిపేట వెళ్లే రోడ్డు ఖాళీగా కనిపించిందిలా..



- భగ్గుమంటున్న భానుడు
- 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండకు బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- ఇంటిలోనూ వేడితో తప్పని ఉక్కపోత
- కూలర్లున్నా.. ఇంట్లో వేడే!

సాక్షి, వరంగల్: భానుడు భగభగమంటున్నాడు...రోహిణీ కార్తెలో సూర్యుడి ప్రతాపం చూపిస్తుండడంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. గత నాలుగు రోజుల నుంచి రోజురోజుకూ పెరుగుతున్న ఎండతో జనాలు రోడ్లెక్కేందుకు జంకుతున్నారు. ఎన్ని పనులున్నా.. ఉదయం ఎనిమిది గంటల్లోపే పూర్తి చేసుకుంటున్న ప్రజలు అత్యవసరమైతే తప్ప రోడ్ల మీద కనిపించే పరిస్థితి లేదు. ఇంట్లో ఉన్నా కూడా ఒంట్లోంచి వేడి వేడి పొగలొస్తున్నాయి. కూలర్లు గంటల తరబడి నడుస్తున్నా.. ఇంట్లోని వాతావరణం చల్లబడడం లేదు. ఇది తట్టుకోలేని చాలామంది ఉపశమనం కోసం ఏసీలను ఆశ్రయిస్తున్నారు.

పల్లెల్లోనూ అదే పరిస్థితి..

గ్రామాల్లో సైతం పనులు ఉదయం పూటే పూర్తి చేసుకుని జనాలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వ్యవసాయ పనులు ఉదయం ఎనిమిది గంటల్లోపు, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల్లోపు చేసుకుంటున్నారు. మరికొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నా.. ప్రస్తుతం మాత్రం సూర్యుడి దెబ్బకు జనాలు విలవిల్లాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. వరంగల్ నగరంతో పాటు వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాల్లో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.



స్కార్ఫ్ కట్టుకుని స్కూటీపై వెళ్తున్న యువతి

గొర్రెకుంటలో అత్యధికంగా...

గీసుకొండ మండలం గొర్రెకుంటలో గురువారం జిల్లాలోనే అత్యధికంగా 44.6 డిగ్రీలు నమోదైంది. శుక్రవారం కూడా ఇక్కడే 45.1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా సంగెం మండలం కాపులకనిపర్తిలో 27.1 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. మిగిలిన మండలాల్లో 40 నుంచి 45.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది. అదే సమయంలో దుగ్గొండిలో అత్యధికంగా ఉక్కపోత 90 శాతం పైనే నమోదైంది. ఓవైపు ప్రచండ భానుడి సెగలు, ఇంకోవైపు ఉక్కపోతతో జనాలు అవస్థలు పడుతున్నారు. కూర్చొన్న చోటనే చాలా మందికి వడదెబ్బ తగులుతుండడంతో వైద్యులను ఆశ్రయిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎండలో తిరిగి అలసటకు గురైతే ఓఆర్ఆర్ ద్రావణం తాగాలని, చల్లని గాలికి ఉండాలని వైద్యులు చెబుతున్నారు. అత్యవసరం అయితే.. తప్ప రోడ్లపైకి జనాలు రావొద్దని సూచిస్తున్నారు.



జిల్లాలో విత్తనాల కొరత లేదు

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ పి.ప్రావీణ్య

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో ఎలాంటి విత్తనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో వానాకాలం 1.05 లక్షల ఎకరాల్లో వరి, 1.28 లక్షల ఎకరాల్లో పత్తి, 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15 వేల ఎకరాల్లో మిరప సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్లు తెలిపారు. ఎవరైనా విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్..

జిల్లా వ్యవసాయ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, విత్తనాలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినా నేరుగా 72888 94714 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. జిల్లాకు 3.50 లక్షల పత్తి విత్తనాలు అవసరం ఉండగా.. 5.25 లక్షల విత్తన ప్యాకెట్లను వివిధ విత్తన దుకాణాల డీలర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1.50 లక్షల విత్తన ప్యాకెట్లను విక్రయించినట్లు పేర్కొన్నారు. రసీదు బిల్లు లేని, నకిలీ విత్తనాలను కొని నష్టపోవద్దని సూచించారు. నాసిరకం విక్రయాలపై జిల్లాలో ఇప్పటికే 2 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విత్తనాలు కొంటే బిల్లులు తీసుకోవాలని సూచించారు.

నాసిరకం అమ్మితే పీడీ యాక్ట్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రావీణ్య పోలీస్ కమిషనర్ ఝా తో కలిసి జిల్లాలోని విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రైతులు నష్టపోకుండా నాసిరకం విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. డీలర్లంతా వ్యవసాయ, పోలీస్ శాఖలకు సహకరించి రైతులకు మేలు చేయాలన్నారు. ముఖ్యంగా చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని, విత్తనాలు అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా, లూజుగా అమ్మినా జరిమానాతో పాటు శిక్ష విధిస్తామన్నారు.



వరంగల్ స్టేషన్ రోడ్డులో విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పాఠశాలల్లో పనులు పూర్తి చేయండి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతిని మండలాల వారీగా సంబంధిత అధికారులు ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 453 పాఠశాలలకు 3,507 డ్యూయల్ డెస్కులు, 280 పాఠశాలలకు 857 గ్రీన్ బోర్డ్స్ వెంటనే సంబంధిత ఏజెన్సీల ద్వారా చెప్పించి అమర్చేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. సమీక్షలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీఈఓ వాసంతి, స్పెషల్ ఆఫీసర్లు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన విక్రయ దుకాణాల తనిఖీ

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగరంలోని దేవీ సీడ్స్, గణపతి, పున్నమి, సీతారామ తదితర విత్తన విక్రయ దుకాణాలను కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్‌ను, విత్తనాల ప్యాకెట్లను, నిల్వ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు అబ్దుల్ బారీ, రవీందర్, ఏసీపీలు తిరుపతి, కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఉషా దయాళ్, ఏడీఏ సురేశ్‌కుమార్, వ్యవసాయ అధికారులు కృష్ణారెడ్డి, సారంగం, శ్రేయ, సురేశ్‌కుమార్, నాగేశ్, విజ్ఞాన్, స్థానిక తహసీల్దార్ ఇక్బాల్ జిల్లా విత్తన డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాల్ని అరికట్టాలి

- న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకులు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా.. కలెక్టర్‌కు వినతి

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో నాసిరకం విత్తనాల్ని అరికట్టాలని నాణ్యత లేని క్రిమిసంహారక మందులు, ఎరువులు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో వరంగల్ నగరంతో పాటు నర్సంపేట వర్ధన్నపేట ప్రాంతాలతో, మండల కేంద్రాల్లోని మేజర్ పంచాయతీల్లో నాసిరకం విత్తనాల దందా కొనసాగుతోందన్నారు. పెద్ద కంపెనీల పేరుతో నకిలీ ప్యాకెట్ల ద్వారా సరఫరా జరుగుతుందని రూ.750 ఉండే ఒక పత్తి విత్తనాల పాకెట్‌ను రూ. 2,000 వరకు బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. నాసిరకం విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క, పీవైఎల్ జిల్లా నాయకులు గంద్రతి హరిబాబు, వీరన్న, భద్రాజి వాగ్య, మహమూద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష

కాశీబుగ్గ సెంటర్: ఈనెల 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈమేరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుక్రవారం టీజీపీఎస్సీ సెక్రటరీ డాక్టర్ నికోలస్ పలు సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అభ్యర్థులకు సూచనలు..

- ఓఎంఆర్ విధానంలో ప్రిలిమినరీ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) ఉంటుంది.
- ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.
- అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతిస్తారు.
- పరీక్ష కేంద్రం గేట్ ఉదయం 10:00 గంటలకు మూసివేస్తారు. ఆ తర్వాత అభ్యర్థులను అనుమతించరు.
- అభ్యర్థులు నేడు (శనివారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి కమిషన్ వెబ్‌సైట్ http://www.tspsc.gov.in నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు పరీక్ష కేంద్రంలోకి తీసుకురావడానికి అనుమతి లేదు.
- అభ్యర్థులు షూ ధరించకుండా.. చెప్పులు మాత్రమే ధరించాలి.
- ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని నిర్ధారించుకోవాలి.
- పరీక్షకు హాజరయ్యే ముందు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న హాల్ టికెట్, ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లోని సూచనలు చదవాలి.

మరియపురాన్ని మోడల్‌గా తీసుకోవాలి

- ఆర్‌జీఎస్‌వై కన్సల్టెంట్ రుచి యాదవ్

గీసుకొండ: గ్రామాభివృద్ధి ప్రణాళికల(జీపీడీపీ)ను తయారు చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ యోజన (ఆర్‌జీఎస్‌వై) కన్సల్‌టెంట్ రుచి యాదవ్ అన్నారు. శుక్రవారం మరియపురం, గంగదేవిపల్లిని బృంద సభ్యులతో కలిసి సందర్శించారు. రెండు గ్రామాలు అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచిన తీరును ఆమె బృంద సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆమెకు గంగదేవిపల్లి సాధించిన విజయాలను మాజీ సర్పంచ్, జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి స్వప్నను అభినందించారు. మరియపురం తరహాలో అన్ని గ్రామాలు గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రొఫైల్‌ను రూపొందించుకోవాలని సూచించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ విజయ్‌నాయక్, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి, జిల్లా ట్రైనింగ్ మేనేజర్లు కూసం రాజమౌళి, కరుణాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఎన్ఐఆర్డీ యంగ్‌మ్యాన్ శేఖర్, ఈటీసీ విభాగం రవిప్రకాశ్, యాదగిరి, మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు వేణుప్రసాద్, తపస్విని, స్వప్న, ప్రశాంత్, ఆపరేటర్లు వేల్పుల సురేశ్‌యాదవ్, శైలజ, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రుచి యాదవ్

పరీక్షల విభాగం.. ప్రక్షాళన జరిగేనా?

- కేయూలో ఆగని ఆన్సర్ బుక్‌లెట్ల మార్పు దందా
- రెగ్యులర్ ఉద్యోగులకంటే తాత్కాలిక సిబ్బంది ఎక్కువ
- క్యాంపులోనైతే మొత్తం దినసరి వేతన కూలీలే
- వేతనాలు తక్కువ.. డబ్బు కోసం దొడ్డిదారులు
- గతంలో రీవాల్యుయేషన్‌లోనూ ఇదే తీరు..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగం గాడి తప్పుతుందా? ఎంతో భద్రత నడుమ ఉండే సెక్షన్‌లో తరచూ ఆన్సర్‌షీట్లు మార్చడం, నకిలీ సర్టిఫికెట్ల ముఠాలతో విభాగం ఉద్యోగులకు లింకులు బయటపడడం, కేయూ పేరుమీద నకిలీ సర్టిఫికెట్లు బయటపడడంలాంటి ఘటనలు చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ విభాగంపై సరైన పర్యవేక్షణ లేకపోవడం.. రెగ్యులర్ ఉద్యోగులు తక్కువగా ఉండి తాత్కాలిక సిబ్బంది ఎక్కువగా ఉండడం, వారికి వేతనాలు తక్కువ ఉండడంతో అదనపు సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఆన్సర్‌షీట్లను మార్చారని తేలడంతో విభాగం పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాకతీయ యూనివర్సిటీలో అత్యంత కీలకమైంది పరీక్షల విభాగం. విద్యార్థుల పరీక్ష పత్రాలు మూల్యాంకనం నిమిత్తం ఈ విభాగానికి వస్తాయి. వాటిని పకడ్బందీగా భద్రపర్చాల్సి ఉంటుంది. ఈ విభాగంలోని వివిధ సెక్షన్లలో రెగ్యులర్ ఉద్యోగుల కంటే తాత్కాలిక ఉద్యోగులే (కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్) ఎక్కువ మంది పనిచేస్తుండడం విస్మయం కలిగిస్తోంది. యూజీ సెక్షన్‌లో ఒక్క రెగ్యులర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మరో రెగ్యులర్ ఉద్యోగి మాత్రమే పనిచేస్తున్నారు. పీజీ సెక్షన్‌లో ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. మిగతా వారంతా తాత్కాలిక ఉద్యోగులే. ప్రొఫెషనల్ కోర్సుల సెక్షన్‌లో నలుగురు రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. సర్టిఫికెట్ సెక్షన్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్, ఒక సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్ మాత్రమే రెగ్యులర్ సిబ్బంది. చివరికి పరీక్షల నియంత్రణాధికారి పేషీలో కూడా తాత్కాలిక ఉద్యోగులే ఉన్నారు. దూరవిద్య విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులు లేరు. అలాగే కాన్ఫిడెన్షియల్ విభాగంలో ఒక్కరే రెగ్యులర్ ఉద్యోగి, కంప్యూటర్ డాటా ఎంట్రీ విభాగంలో ముగ్గురు రెగ్యులర్ ఉద్యోగులు. మిగతా వారంతా తాత్కాలిక ఉద్యోగులే ఉన్నారు. వీరిని ఇటీవల ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిగా మార్చి వేతనాలు పెంచారు. కానీ అంతకుముందు చాలా ఏళ్లుగా తక్కువ వేతనాలు ఉండడంతో అందులో కొందరు అక్రమమార్గంలో విద్యార్థులను పాస్ చేయించేందుకు డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



కేయూ పరీక్షల విభాగం

కొన్నేళ్ల క్రితం పైసలిస్తే పాస్

కొన్నేళ్ల క్రితం భీమారంలో నకిలీ సర్టిఫికెట్ల విక్రయించే ముఠా పోలీసులకు చిక్కింది. ఆ ముఠాకు కేయూ పరీక్షల విభాగంలో పనిచేసే పలువురు తాత్కాలిక ఉద్యోగులతో ఉన్న సంబంధం బయపటడింది. దీంతోపాటు రీవాల్యుయేషన్ దందా కూడా సాగింది. వీటిపై 'సాక్షి' అప్పట్లోనే వరుస కథనాలు ప్రచురించింది. అప్పటి అధికారులు స్పందించి ఓ పోలీస్ అధికారితో రీ వాల్యుయేషన్ పాస్ దందాపై విచారణ జరిపింది. వాస్తవమని తేలడంతో ఆరుగురు తాత్కాలిక ఉద్యోగులను తొలగించారు. ఓ రెగ్యులర్ ఉద్యోగిని బదిలీ చేశారు. చివరికి ఓ పరీక్షల నియంత్రణాధికారిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారిని ఆ పదవులనుంచి తొలగించారు. అప్పటి వీసీ ఓ విచారణ కమిటీ వేశారు, కానీ తరువాత ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీని తరువాత కొందరు అక్రమమార్గంలో విద్యార్థులను పాస్ చేయిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు వెలుగుచూస్తూనే ఉన్నాయి. మరోవైపు కాకతీయ యూనివర్సిటీ పేరుతో నకిలీ సర్టిఫికెట్ల తయారు చేసే ముఠాలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కువగా ప్రొఫెషనల్ కోర్సుల్లో సర్టిఫికెట్లు విక్రయించినట్లు బయటపడింది. కేయూ పేరుతో వివిధ కోర్సుల నకిలీ సర్టిఫికెట్లు పొందిన వారి జాబితా కూడా ఉన్నట్లు సమాచారం.

క్యాంపులో దినసరి వేతన కూలీలు

పరీక్షలు నిర్వహించాక వివిధ కేంద్రాలనుంచి జవాబుపత్రాలు ఈ పరీక్షల విభాగం క్యాంపులోకి వస్తాయి. కోడింగ్ ప్రక్రియ అనంతరం జవాబుపత్రాల మూల్యాంకనం జరిగే వరకు ఇక్కడి దినసరి వేతన కూలీలదే కీలకపాత్ర. జవాబుపత్రాల బండిల్స్‌ను విప్పడం, వాటిని కోడింగ్ ప్రక్రియ చేసేవారికి అందించడం, అనంతరం వాల్యుయేషన్ చేసే అధ్యాపకులకు అందించడం, తిరిగి డీకోడింగ్ వరకు వారి కనుసన్నల్లోనే నడుస్తుంది. ఏ కళాశాల, ఏ పరీక్ష కేంద్రం జవాబుపత్రాల బండిల్స్ అనేవి కూడా వారికి తెలిసిపోతుంది. డిగ్రీ కోర్సుల క్యాంపులో 20మందికిపైగా దినసరి వేతన కూలీలు పనిచేస్తుండగా వీరికి రోజువారీ వేతనంగా రూ.220 చొప్పున నెలవారీగా అందిస్తున్నారు. ఆరేళ్ల నుంచి పదేళ్ల వరకు ఒకేచోట పనిచేస్తున్నారు. ఇందులో ముగ్గురు కూలీలు ఆన్సర్ బుక్‌లెట్లను మార్చేస్తున్నారనేది గురువారం వెల్లడైంది. వీరే కాకుండా పలువురు లంప్సమ్ ఉద్యోగులు (ఔట్ సోర్సింగ్) కూడా పనిచేస్తున్నారు. వీరిలో ఎవరైనా ఇలాంటి ఘటనకు పాల్పడ్డారా లేదా? అనే కోణంలో కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం

పరీక్షల విభాగంలో నిఘా ఏది?

పరీక్షల విభాగం అంటేనే అత్యంత కాన్ఫిడెన్షియల్‌గా ఉండాలి. అలాంటి పరీక్షల విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులకంటే తాత్కాలిక ఉద్యోగులు ఎక్కువగా ఉండడం, అందులోనూ క్యాంపుల్లో దినసరి వేతన కూలీలు సంవత్సరాల తరబడి కొనసాగడం వల్ల వారికి అందులో ఉండే లూప్‌హోల్స్ కూడా తెలిసిపోయాయి. అధికారుల కళ్లుగప్పి ఆన్సర్‌షీట్లను మారుస్తున్నారని తెలుస్తోంది. వీరిపై పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం ఉంది. విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులు ఉంటే బాధ్యత ఉంటుందని, తప్పుచేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ తాత్కాలిక ఉద్యోగులైతే తప్పు చేసినప్పుడు విధుల నుంచి తప్పిస్తారు లేదా వేరేచోటికి బదిలీ చేస్తున్నారనేది యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. దినసరి వేతన కూలీలస్థానంలో ఇటీవల వేతనాలు పెరిగిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కొందరినైనే వినియోగించుకోవాలనే చర్చ కూడా నడుస్తోంది. విభాగాన్ని రెగ్యులర్ ఉద్యోగులతో ప్రక్షాళన చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

కొనసాగుతున్న విచారణ

- ఆన్సర్ బుక్‌లెట్ మార్చిన వ్యవహారంపై సీరియస్
- పోలీసుల అదుపులో ముగ్గురు దినసరి వేతన కూలీలు
- ఆన్సర్ షీట్ల మార్పిడిలో పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు
- డిగ్రీ పరీక్షల వాల్యుయేషన్ ప్రక్రియ నిలిపివేత

- వివరాలు 10లో▸

సహకార సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనల ఆహ్వానం

- జిల్లా సహకార, అదనపు ఎన్నికల అధికారి బి.సంజీవరెడ్డి

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలోని అన్ని రకాల సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలివ్వాలని జిల్లా సహకార, అదనపు ఎన్నికల అధికారి బి.సంజీవరెడ్డి కోరారు. ఈనెల 6 నుంచి 28వ తేదీ వరకు అన్ని రకాల సహకార సంఘాలకు (కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘాలు, డెయిరీ, అర్బన్ సహకార బ్యాంక్స్, ప్లాట్ ఓనర్స్ సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలకు) ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ప్రతీ సంఘం నుంచి (ఎన్నికలు జరగని) ప్రతిపాదనలను సంబంధిత ఫంక్షనల్ రిజిస్ట్రార్స్ నుంచి జిల్లా అదనపు సహకార ఎన్నికల అధికారికి పంపించి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీచే ఎన్నికలు జరిపించుకోవాలని సూచించారు. ఎన్నికలు జరగని సహకార సంఘాలకు జూన్ 6 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

లోగో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



వరంగల్ లీగల్: తెలంగాణ రాష్ట్ర లోగో మార్పు నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. లోగో మార్పును వ్యతిరేకిస్తూ శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఓరుగల్లుకు ప్రతీకగా నిలిచిన కాకతీయ తోరణం తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో గుర్రాల వినోద్‌కుమార్, గోగికార్ శివరాజు, సీనియర్ న్యాయవాదులు ముద్దసాని సహోదర్ రెడ్డి, టి.మహేంద్ర ప్రసాద్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాతంగి రమేష్ బాబు, నభీ సంసాని సునీల్, టి.జనార్దన్ గౌడ్, వసంత్ యాదవ్, శ్రీరామ్ కిరణ్ కుమార్, వేణు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ స్టాండింగ్ కమిటీ సమావేశం

- పీహెచ్‌డీ అడ్మిషన్ల కొత్తరూల్స్‌కు ఆమోదం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం అకాడమిక్ కమిటీలో హాల్‌లో నిర్వహించారు. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి నూతనంగా రూపొందించిన యూజీసీ రూల్స్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించినట్లు సమాచారం. అలాగే జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌లు కలిగిన దివ్యాంగులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించి ఆమోదించారు. ఇదిలాఉండగా.. యూజీసీ కొత్త రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు కొత్త రూల్స్‌ను కేయూ రూపొందించుకున్నందున రాబోయే రోజుల్లో నేషనల్ ఎల్జిబులిటీ టెస్ట్‌లో మెరిట్ కలిగినవారికే పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించే అవకాశాలున్నాయని తెలిసింది. పీహెచ్‌డీ అడ్మిషన్ల కొత్త రూల్స్‌ను త్వరలోనే కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొనగా.. హైదరాబాద్ నుంచి కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ పాల్గొన్నారు.

'ఇరిగేషన్'లో ఏం జరుగుతోంది.!

- పదోన్నతులు, పోస్టింగ్‌లపై పోస్టుమార్టం
- నీటిపారుదలశాఖపైన ప్రభుత్వం సీరియస్
- వివాదంలో ఉన్న ఈఈకి పదోన్నతిపై ఆగ్రహం..
- స్నేహితుడైన ఓ ఉన్నతాధికారి పాత్ర ఉన్నట్లు వెల్లడి..
- వరంగల్ సర్కిల్ ఎస్ఈ గా మళ్లీ వెంకటేశ్వర్లు..
- కాళేశ్వరంలో అగ్జిలరీ ప్రమోషన్లపైన విచారణ
- ప్రక్షాళన దిశగా అడుగులు.. మరో ఎస్ఈ, ఈఈలపై త్వరలోనే వేటు?



'సాక్షి'లో వెలువడిన కథనం క్లిప్పింగ్

సాక్షి ప్రతినిధి, వరంగల్ : నీటిపారుదలశాఖ(జలవనరుల శాఖ)లో అసలేం జరుగుతోంది? ప్రభుత్వం సూచనలు, సిఫారసుల ఉల్లంఘనకు కారణాలు ఏమిటి? పదేళ్లుగా పాతుకుపోయిన కొందరు ఉన్నతాధికారులు ఇంకా 'పాత' సంబంధాలను కొనసాగిస్తున్నారా? పదోన్నతులు, పోస్టింగ్‌ల విషయంలో ప్రభుత్వం సూచనలకు వక్రభాష్యం వెనుక ఏం జరిగింది? అన్న అంశాలపై ప్రభుత్వం ఆరా తీస్తున్నది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) కమిటీ సిఫారసుల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతులు చేపడుతూనే.. మరోవైపు నీటిపారుదలశాఖలో ఇటీవల పరిణామాలపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి అధికారులతో పోస్టుమార్టం నిర్వహిస్తుండటం ఇంజనీరింగ్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

పదోన్నతులు, పోస్టింగ్‌ల దుమారం..

బీఆర్ఎస్ హయాంలో జరిగిన.. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతులు, పోస్టింగ్‌ల వ్యవహారం దుమారంగా మారింది. కాళేశ్వరం లింక్–1, లింక్–2లో కష్టపడి పనిచేసిన వారికి పోత్సాహకంగా ప్రమోషన్(అగ్జిలరీ ప్రమోషన్) ఇచ్చి గౌరవించాలని తలపించి అప్పటి సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులు మేడిగడ్డ, అన్నారం, లింకు–2 నుంచి బీవీ.రమణారెడ్డి (ఈఈ), ఎం.రాజు (ఏఈఈ), యాదగిరి (డీఈఈ), పి.రవిచంద్ర (ఏఈఈ)లు, ఎస్.శ్రీధర్ (డీఈఈ) పేర్లు పంపారు. దీంతో ప్రాజెక్టు ప్రారంభం నుంచి కఠోరశ్రమ చేసిన పలు విభాగాలకు చెందిన పలువురిని విస్మరించారన్న అసంతృప్తి చెలరేగింది. కాళేశ్వరం లింక్ –2 సర్కిల్ రూపకల్పన నుంచి రామగుండం డివిజన్–1 ఏర్పడి, మేడిగడ్డ బ్యారేజ్ నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు ప్రాథమిక ఇన్వెస్టిగేషన్ పనులు చేస్తూ లైడార్ సర్వే చేపట్టిన ఇంజనీర్లు ఒక్కరూ ఆ జాబితాలో లేరన్న ఫిర్యాదులు కేసీఆర్ వరకు వెళ్లాయి. కాళేశ్వరం లింక్–1 ఎస్టిమేట్స్, టెండర్లు, వ్యాప్‌కోస్ నుంచి డిజైన్స్, డ్రాయింగ్, అగ్రిమెంట్ల వరకు పనిచేసిన వారిని పక్కకు పెట్టడం.. పురుషులతో సమాన స్థాయిలో రాత్రి 12 గంటల వరకు పని చేసిన మహిళా ఏఈఈలను విస్మరించడం వివాదాస్పదంగా మారింది. పదోన్నతులు దక్కని ఇంజనీర్ల ఈ వివాదం ఇంకా మరచిపోకముందే.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరిపై నిర్మించిన బ్యారేజీలపై విచారణ జరుగుతుండగా, విచారణ ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఓంకార్ సింగ్‌ను సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) (హనుమకొండ కన్‌స్ట్రక్షన్ సర్కిల్)గా అదనపు బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై ఈనెల 26న 'అప్పుడు.. ఇప్పుడు అదే తంతు..' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనాన్ని కొందరు ఇంజనీర్లు నీటిపారుదలశాఖ మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఓంకార్ సింగ్ పదోన్నతి, బదిలీ రద్దు చేయడంతో పాటు ఎస్.శ్రీధర్ అనే ఈఈని ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈఈ ఓంకార్ సింగ్ వివాదం సద్దుమణగకముందే ఆయనకు ఎస్ఈ బాధ్యతలు కట్టబెట్టడం వెనుక అతనికి క్లాస్‌మేట్ అయిన ఓ ఉన్నతాధికారి హస్తం ఉందని తేలినట్లు సమాచారం. దీనిపైనా ఆరా తీస్తున్న నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇంతకు ముందున్న వెంకటేశ్వర్లునే మళ్లీ వరంగల్ సర్కిల్ ఎస్ ఈ గా నియమించగా ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

త్వరలోనే మరికొందరిపైనా..?

గతంలో జరిగిన పదోన్నతులు, బదిలీలతోపాటు కాంట్రాక్టర్లకు మేలు చేయడానికి జరిగిన నియామకాలపైనా ప్రభుత్వ పెద్దలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇరిగేషన్‌శాఖను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం.. ఎన్నికల కోడ్ తర్వాత మరికొందరిపైనా సస్పెన్షన్, బదిలీ వేటు పడవచ్చన్న చర్చ ఇంజనీరింగ్‌వర్గాల్లో సాగుతోంది. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తికాకముందే పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో పాటు బ్యాంకు గ్యారంటీ (బీజీ)లు విడుదల చేసిన ఉన్నతాధికారులను ఎందుకు ఉపేక్షిస్తున్నారు? అన్న చర్చ తాజాగా జరుగుతోంది. ఓ వైపు ప్రాజెక్టు పూర్తైనట్లు ఇంజినీర్లు ధ్రువీకరణ పత్రం జారీ చేసి, మరోవైపు పెండింగ్ పనులు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థలకు లేఖ రాసిన వ్యవహారంపైనా విచారణ జరుగుతోంది. ఈ పనులు జరుగుతున్న సమయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా బాధ్యతలు అప్పగించి ఆ రెండు పదవుల్లో తిరుపతిరావు అనే ఇంజనీర్‌ను కొనసాగించారు. ఏఈఈలు, మిగతా డీఈఈలకు సంబంధం లేకుండా ప్రాజెక్టు పూర్తయినట్లు ధ్రువీకరణపత్రం జారీ చేసిన ఈఈ తిరుపతిరావు, అప్పటి ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎస్ఈ రమణారెడ్డిలపైనా విచారణ చేపట్టి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలకు సిఫారసు చేసింది. ఈ విషయంలో జరుగుతున్న తాత్సారానికి కారణాలను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రస్తావించడం.. ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఓ ఎస్ఈ, ఓ ఈఈపైనా త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

ఆస్పత్రి ఎదుట చితిపేర్చి ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలని బంధువుల డిమాండ్
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

వరంగల్/కాశిబుగ్గ: అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతూ మృతిచెందిన మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంలో మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ.. ఆస్పత్రి ఎదుట చితి పేర్చి ఆందోళన చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గిర్మాజీపేటకు చెందిన ఐలోని వాణి(45) కిడ్నీ సమస్యతో డాక్టర్ విద్యాధర్ వద్దకు వెళ్లగా అతను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశాడు. దీంతో మే 11న సదరు ఆస్పత్రిలో జాయిన్ కాగా.. వైద్యులు 12వ తేదీన వాణికి ఆపరేషన్ చేశారు. మూడోరోజున తర్వాత వాంతులు కావడంతో సిటీ స్కాన్ చేసి పెద్దపేగుకు రంధ్రం పడిందని 16వ తేదీన మరో ఆపరేషన్ చేశారు. మరో మూడు రోజులకు లంగ్స్‌కు ఇన్‌ఫెక్షన్ వచ్చిందని ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని, కిడ్నీలు కూడా సరిగా పనిచేయడం లేదని పరిస్థితి సీరియస్ ఉందని చెప్పిన వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో రూ.లక్షలు తీసుకుని ఇప్పుడు హైదరాబాద్‌కు తీసుకుపోమంటారా.. అంటూ ఈనెల 24వ తేదీన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మెరుగైన చికిత్స కోసం వాణిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలిస్తే వైద్య ఖర్చులు తమ ఆసుపత్రి యాజమాన్యం భరిస్తుందని చెప్పారు. ఈక్రమంలో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి వాణి మృతి చెందింది. అయితే వాణి మృతికి వరంగల్‌లో చికిత్స చేసిన ఆస్పత్రి వైద్యులే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట చితి పేర్చి ధర్నాకు దిగారు. వాణి కుటుంబానికి న్యాయం చేసి, ఆస్పత్రిని మూసివేయాలని బంధువులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి మాట్లాడుతూ.. వాణి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆస్పత్రికి చెల్లించిన డబ్బులను వాపస్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏసీపీ నందిరాంనాయక్, ఐఎంఏ ప్రతినిధులు ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఇదే విషయంపై ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చేరిన వాణికి ఆపరేషన్ తర్వాత సమస్యలు తలెత్తి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. తమ ఆస్పత్రిలో కేవలం ఇన్సూరెన్స్ తోనే చికిత్స అందించామని, చికిత్సలో ఎలాంటి లోపాలు లేవని తెలిపారు.

కేసు నమోదు

ఖిలా వరంగల్: కిడ్నీ ఆపరేషన్ వికటించి వరంగల్ గిర్మాజీపేటకు చెందిన అయిలోని వాణి (54) మృతి చెందగా.. సంరక్ష ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం తెలిపారు. మృతురాలి తండ్రి అయిలోని శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

కేయూలో కొనసాగుతున్న విచారణ

- ఆన్సర్ బుక్‌లెట్ మార్చిన వ్యవహారంపై అదుపులో దినసరి వేతనకూలీలు
- డిగ్రీ వాల్యూయేషన్ ప్రక్రియ నిలిపివేత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సులకు సంబంధించిన ఆరో సెమిస్టర్ పరీక్షల జవాబుపత్రాల బండిల్స్‌లో నుంచి దినసరివేతన కూలీలు ఆన్సర్ బుక్‌లెట్లను బయటికి తీసుకెళ్లి రాయించి.. మళ్లీ అదే బండిల్స్‌లో పెట్టిన వ్యవహారం తెలిసిందే.. ఈ నేపథ్యంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు ముగ్గురు దినసరి వేతన కూలీలను గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. విద్యార్థులు ఏఏ కళాశాలలకు చెందినవారు.. తొలుత ఎవరిని సంప్రదించారు.. ఈ దందా ఎంత కాలం నుంచి సాగుతుందనే సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే హనుమకొండలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు తమ జవాబు పత్రాలను మార్పించుకున్నారని గుర్తించినట్లు సమాచారం. కూలీలు బయటకు తీసుకొచ్చిన బుక్‌లెట్లు అన్ని డిగ్రీ ఫైనల్‌ఇయర్ ఆరో సెమిస్టర్ పరీక్షల వివిధ సబ్జెక్టుల జవాబు పత్రాలుగా గుర్తించారని సమాచారం. విద్యార్థుల వివరాలు సేకరించి, వారికి కూడా పోలీసులు విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తుంది. పోలీసులు ఇప్పటికే పలువురు విద్యార్థులకు ఫోన్ చేసి ఆరా తీసినట్లు కేయూలో చర్చ జరుగుతోంది. ఇదిలాఉండగా.. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2వ, నాల్గవ, ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తికావచ్చాయి. అయితే ఆయా పరీక్షల జవాబుపత్రాలు పరీక్షల విభాగానికి చేరినప్పటికీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ముందుగా ఇవ్వాలనే యోచనతో పరీక్షల విభాగంలో తొలుత ఆ సెమిస్టర్ల జవాబుపత్రాల మూల్యాంకణానికి కోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు. గురువారం బుక్‌లెట్ మార్పిడి వ్యవహారం వెలుగులోనికి రావడంతో ఇక అందులో పనిచేసే దినసరివేతన కూలీలు 20మందిని విధుల్లోంచి తొలగించారు. దీంతో శుక్రవారం మూల్యాంకణం నిలిపివేశారు. ఒకటి రెండు రోజుల్లో అధ్యాపకులతో మూల్యాంకనం చేయించాలనే యోచనలో యూనివర్సిటీ అధికారులు ఉన్నట్లు సమాచారం.

రూ.వంద ఇస్తే వీల్‌చైర్ ఇస్తారట..!

- ఇబ్బందులు పడిన దివ్యాంగురాలు



కష్టంగా నడుచుకుంటూ వస్తున్న దివ్యాంగురాలు

కాశిబుగ్గ: 'వంద రూపాయులు ఇస్తే వీల్‌చైర్‌లో దించుతారటా.. ఇదేమిటని ప్రశ్నిస్తే పుణ్యానికి ఎవరు ఇస్తారు అని రైల్వే సిబ్బంది అంటున్నారు. స్టేషన్ మాస్టార్‌గారు ఇది ఒకసారి చూడండి' అంటూ ఓ ప్రయాణికుడు మాట్లాడిన వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. సికింద్రాబాద్ నుంచి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ దివ్యాంగురాలు వరంగల్‌కు వచ్చి స్టేషన్ బయటకు వెళ్లేందుకు నడవలేక ఇబ్బందులు పడుతుంది. గమనించిన ఓ ప్రయాణికుడు మొదటి ప్లాట్‌ఫాంలో విధులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది(టీసీ)ని వీల్‌చైర్ ఇవ్వరా.. అని అడగగా 'వంద రూపాయలిస్తే వీల్‌చైర్‌లో బయటకు తీసుకెళ్తారు. ఫ్రీగా పుణ్యానికి ఇవ్వాలా.. అని టీసీ మాట్లాడుతున్నాడని, ఇది ఎంతవరకు న్యాయమని, స్టేషన్ మాస్టార్ గారు ఇది ఒకసారి చూడండి' అంటూ ఆవేదనగా చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. రూ.70పెట్టి రైలులో వస్తే వంద రూపాయిలు వీల్‌చైర్‌కు ఇవ్వాలంట.. ఇదేమిటని నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వీల్‌చైర్లు ఉచితంగా అందుబాటులోకి పెట్టాలని రైల్వే అధికారులను కోరుతున్నారు.

ప్రాణం తీసిన వడదెబ్బ

వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. సుమారు 40డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరుచోట్ల ముగ్గురు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



ఐలయ్య (ఫైల్)

చెన్నారావుపేట : వడదెబ్బకు గురై పందుల కాపరి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లకొండ ఐలయ్య(74) రోజువారీగా పందులు మేపడానికి వెళ్లి ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురై మృతి చెందాడు. కాగా ఏకలవ్య సంఘం మండల అధ్యక్షుడు పులిశేరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి తదితరులు ఐలయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నివాళులర్పించిన వారిలో రాయపురి శ్రీను, సమ్మయ్య, రాజేందర్, వెంకటేష్, కుమారస్వామి, సారయ్య, మల్లయ్య, సదయ్య ఉన్నారు.

రాజుపేట వ్యక్తి..

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలంలోని రాజుపేటకు చెందిన దామెర రాంబాబు(48) వడదెబ్బకు గురై శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు రాంబాబు స్థానికంగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం వ్యక్తిగత పనిపై గ్రామంలోకి వెళ్లి ఇంటికి వచ్చిన ఆయన వడదెబ్బకు గురై ఉన్నపలంగా కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం స్థానిక వైద్యుడిని పిలిపించి చూపించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్యారాణి గత నాలుగేళ్ల క్రితం కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో రెండేళ్ల క్రితం రాంబాబు రెండో పెళ్లి చేసుకున్నాడు. మృతుడికి రెండో భార్య మానస, కుమార్తె ఉన్నారు.



రాంబాబు మృతదేహం

గూడూరులో మహిళ..



ఎల్లమ్మ (ఫైల్)

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన జన్ను ఎల్లమ్మ (50) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు ఉదయం కూలి పనులకు వెళ్లివచ్చే ఎల్లమ్మ వారం రోజుల క్రితం ఎండ వేడిమి తట్టుకోలేక ఇంటికి వచ్చి పడిపోయింది. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుకున్న ఎంపీపీ కత్తి స్వామి, మాజీ సర్పంచ్ రమేశ్ నాయక్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

మూడేళ్లకే నూరేళ్లు నిండాయా..


- రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



చిన్నారి ఆద్య మృతదేహం

మంగపేట: బిడ్డా.. మూడేళ్లకే నూరేళ్లు నిండాయా.. అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి ఆద్య(03) తండ్రి విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ గొత్తికోయ గూడేనికి చెందిన బాడిష నగేష్.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని జానంపేట పంచాయతీ పరిధిలోని సుదరయ్యనగర్ నుంచి శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై బంధువు అయిన మాడవి జ్యోతి, తన కుమార్తె(మూడేళ్ల చిన్నారి) ఆద్య వస్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో రమణక్కపేట వద్ద రాత్రి సుమారు 8.30గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి ఆద్య మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన చిన్నారి తల్లి జ్యోతిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆద్య తండ్రి మాడవి అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

హసన్‌పర్తి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వంగపహాడ్‌కు చెందిన టైల్స్ మేస్త్రీ అవునూరి శ్రీకాంత్ (34) పనిలో భాగంగా గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారానికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై వంగపహాడ్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో వంగపహాడ్ గ్రామంలో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా శ్రీకాంత్ వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో శ్రీకాంత్‌కు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీకాంత్ తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

కేసు నమోదు

గార్ల: అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేస్తున్న ఓ భర్త, అత్తమామలపై కేసు నమోదైంది. ఎస్సై జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గార్లకు చెందిన మౌనికతో సీతంపేటకు చెందిన కొనకంచి కొండల్‌రావుకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో అమ్మాయికి తల్లిదండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఒక బాబు సంతానం. బాబు పుట్టిన నాటి నుంచి భర్త కొండల్‌రావుతోపాటు, అత్త లక్ష్మి, మామ నర్సయ్య తరచూ మౌనికను అదనపు కట్నం తీసుకురమ్మంటూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో మౌనిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణం

- ఆర్థిక ఇబ్బందులే కారణం



నివాళులర్పిస్తున్న మహబూబాబాద్ ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : అప్పుల బాధలు తాళలేక మనస్తాపానికి గురైన ఓ హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడిన విషాద సంఘటన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఖమ్మం పట్టణంలో నివాసముండే బత్తిని మనోహర్ (55) జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ కంట్రోల్ రూంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య అంజలి, ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు మధుకర్ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణలో ఉన్నాడు. రెండో కుమారుడు శ్రీకర్‌ను ఆస్ట్రేలియాకు పంపేందుకు అప్పులు చేశాడు. అప్పుల బాధలు తాళలేక మనస్తాపానికి గురైన మనోహర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నరసింహనగర్ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాలపడ్డాడు. స్థానికు లు శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వగా రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మనోహర్ భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ ఆస్పత్రి పోస్ట్ మార్టం గది వద్ద మనోహర్ మృతదేహానికి మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు పోలీస్ వెల్ఫేర్ తరఫున ఫ్యూనరల్ చార్జెస్‌లో భాగంగా రూ.20వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ తిరుపతిరావు, రూరల్, టౌన్ ఎస్సైలు సర్వయ్య, దేవేందర్, దీపికరెడ్డి, కుమారస్వామి, కురవి ఎస్సై గోపి, సిబ్బంది ఉన్నారు.



మనోహర్ (ఫైల్)

గార్లలో విషాదఛాయలు

గార్ల: గార్లకు చెందిన బత్తిని మనోహర్ ఆత్మహత్యతో గార్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. మనోహర్ ప్రస్తుతం మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

మనస్తాపంతో వ్యక్తి ..

బచ్చన్నపేట: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని ఆలింపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాకాల సాయి(28)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. కొన్నాళ్లు సజావుగా సాగిన కాపురంలో సమస్యలు తలెత్తాయి. విడాకుల వరకు పోయినా తిరిగి కలిసి ఉంటున్నారు. ఈమధ్య మళ్లీ తన భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయి గురువారం రాత్రి గ్రామంలో ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలపడ్డాడు. తల్లిదండ్రులు సుగుణమ్మ, ఎల్లయ్య, భార్య మానస ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పెద్దమనుషుల వేధింపులు తట్టుకోలేక వ్యక్తి..



ఇస్లావత్ మాలు

మహబూబాబాద్ రూరల్ : తాను తప్పు చేయకున్నా చేసినట్లు ఆరోపిస్తూ.. తప్పును అంగీకరించాలని పెద్దమనుషులు వేధించడంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా(ఎం) గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా (ఎం)కు చెందిన ఇస్లావత్ వెంకన్నకు సంబంధించిన కరెంటు మోటారు అపహరణకు గురైంది. ఈనేపథ్యంలో అదే తండాకు చెందిన ఇస్లావత్ మాలు (35) దొంగతనం చేశాడని అభియోగం మోపి.. ఒప్పుకోవాలని పెద్దమనుషులు వేధింపులకు గురిచేశారు. దీంతోపాటు కురవి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఓ కానిస్టేబుల్ మాలు ఆచూకీ కోసం తండాకు వచ్చి వెళ్లాడు. దీంతో ఆందోళనకు గురైన మాలు గురువారం మధ్యాహ్నం పురుగుల మందుతాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మాలును వేధింపులకు గురిచేసి, అతని మృతికి కారణమైన గ్రామ పెద్దమనుషులు ఇస్లావత్ వెంకన్న(లాలు), ఇస్లావత్ పద్మ, గుగులోత్ ఉష, ఇస్లావత్ లచ్చిరాం, ఇస్లావత్ వెంకన్న(ధూప్‌సింగ్), ఇస్లావత్ రవి, భూక్య హట్టి, భూక్య శ్రీనుపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మృతుడి భార్య శాంతి కురవి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై బైరు గోపి తెలిపారు.